ముస్లింల సంక్షేమానికి పాటుపడింది బీఆర్‌ఎస్సే..

- కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు
- బీఆర్‌ఎస్‌ను గెలిపించి అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి


ముస్లిం మైనార్టీ సమావేశంలో మాట్లాడుతున్న మాధవరం కృష్ణారావు


సమావేశంలో పెద్ద ఎత్తున ముస్లిం మహిళలు, నాయకులు


బాలానగర్ డివిజన్‌లో రోడ్ షోలో పాల్గొన్న మాధవరం కృష్ణారావు తదితరులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: దేశంలో తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వమే ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం ఎంతగానో పాటు పడిందని బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఏజాజ్, డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జహంగీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల సమావేశానికి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలసి ఆయన హాజరై కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ముస్లిం కోసం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో గ్రేవియార్డుల అభివృద్ధి, మసీద్‌ల నిర్మాణం, ఈద్గాల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేసి అందించిన ఘనత తమదేనని వెల్లడించారు.

◆ బాలానగర్ డివిజన్ దిల్‌ఖుష్‌నగర్ ప్రజలకు రోడ్డు లేక అడపడచులు ఇబ్బందులు పడుతుంటే ఐడీపీఎల్ స్థలంలో రూ.70లక్షలతో 24 గంటలలో రోడ్డు వేసిన ఘనత మాది అని తెలిపారు. బేగంపేటలో మసీద్‌తో పాటు ఎకరం స్థలం గ్రేవ్‌యార్డ్‌కు కేటాయించామని అన్నారు. కేపీహెచ్‌బీలో 3ఎకరాలలో కమ్యూనిటీహాల్ మిగత రెండు ఎకరాలలో ఈద్గా, గ్రేవ్‌యార్డ్ నిర్మించామని తెలిపారు. ఇలా ప్రతి డివిజన్‌లో ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ఏనలేని కృషి చేశామని 50 ఏళ్లలో ఎవరు చెయ్యలేని పనులను సహాసోపేతంగా పూర్తి చేశామని అన్నారు.

◆ తాను చెప్పిన పనులు చేయకపోవతే ఓటెయ్యకండని చెప్పారు. మైనార్టీలకు ఇచ్చిన హామీలను అన్నింటిని నేరవేర్చామన్నారు. తనను గెలిపిస్తే దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి 5 విడతలుగా డబల్ బెడ్‌రూములను అందించి తీరుతానని హామీ ఇచ్చారు.

రేవంత్‌రెడ్డి ఒక్క రోజైన మీకు కనిపించడా..

రేవంత్‌రెడ్డి ముస్లిం ఓట్లతో ఎంపిగా గెలిచి ఇక్క రోజైన మీ సమస్యలపై కాని మీరు కనిపించిన దాఖాలలు ఉన్నాయా ప్రశ్నించారు. కర్నాటకలో దొంగ హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత ఇక్క హామీ నిలబెట్టుకోలేక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అమలు చేస్తామంటున్న పథకాలు ఇవ్వగలడా మీరే ఒక్కసారి ఆలోచించడన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అబద్దాల మాటలతో ముస్లింలను ఓట్ల కోసం మాయ చేస్తున్నడని ఇది గుర్తుంచుకుని మీ కోసం పని చేస్తున్న తనను గుర్తించి గెలిపించాలని కోరారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతాయి...

బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తే ప్రతి ఇంటికి రూ. 5 లక్షల కేసీఆర్ బీమా, రేషన్ కార్డులు ఉన్న వారందరికి సన్న బియ్యం, అసరా పెన్షన్ రూ. 5016, దివ్యాంగులకు రూ. 6 వేలు, కేసీఆర్ అరోగ్య రక్ష కింద రూ 15 లక్షలు, సౌభాగ్య లక్ష్మీ కింద రూ. 3 వేలు, గ్యాస్ సిలిండర్ రూ 400లకే, హైదరాబాద్‌లో మరో లక్ష డబల్ బెడ్ రూములను అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామన్నారు. దీనికి స్పందించి ముస్లింలు ఐక్యతగా కారు గుర్తుకే తమ ఓటు అని మాధవరం కృష్ణారావును గెలిపించుకుని తీరుతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నాయకులు ఖాజా, ఖదీర్, ఇబ్బు, అబిద్ తోపాటు ముస్లిం మత పెద్దలు, ముస్లిం మహిళలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కారు గుర్తుకే ఓటేయాలి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావు ఆదివారం బాలానగర్ డివిజన్‌లోని రాజుకాలనీ, వినాయక్‌నగర్, ఫిరోజ్‌గూడ, దిల్‌కుష్ నగర్‌లలో స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ... కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధిని, ఇప్పటి వరకు ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను చూసి తనకు ఓటు వేయాలన్నారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయటంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

జోరుగా కృష్ణారావు తనయుడి ప్రచారం

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావు తనయుడు మాధవరం సందీప్‌రావు, స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తనయుడు ముద్దం మల్లికార్జున యాదవ్‌తో కలసి డివిజన్ పాదయాత్ర చేసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందిస్తూ కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యేగా మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ ప్రచారంలో నాయకులు మక్కాల నర్సింగ్‌రావు, ఎనుగుల తిరుపతి, బల్‌రాజు, మక్కాల సత్యనారాయణ, కృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కనకరాజుయాదవ్, బుర్రి యాదగిరి మహిళలు పాల్గొన్నారు.


ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తనయుడు సందీప్‌రావు, కార్పొరేటర్ తనయుడు మల్లికార్జున్ యాదవ్

శేరిలింగంపల్లిలో గాంధీని గెలిపించాలి

జోరుగా బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల ప్రచారం

భాగ్యనగర్‌కాలనీ/ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీని గెలిపించాలని ఆదివారం హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్ డివిజన్లలో కార్పొరేటర్లు జోరుగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచారం కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, రోజాదేవి, నాయకులు పాల్గొన్నారు.

అరెకపూడి గాంధీ కుటుంబీకుల ప్రచారం..

వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని విశాల్ టవర్స్, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్‌లో అరెకపూడి గాంధీ తనయుడు పృథ్వీ, కుమార్తె ప్రణీత, కోడలు డాక్టర్ భార్గవి ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటేసి అరెకపూడి గాంధీని గెలిపించాలని అభ్యర్థించారు.

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరిన యువకులు...

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీ నాయకుడు జాన్ ఆధ్వర్యంలో ఆదివారం 200 మందికి పైగా కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.


సప్తగిరి కాలనీలో మాట్లాడుతున్న అరెకపూడి గాంధీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

మహిళా కవి సమ్మేళనం

నిజాంపేట్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. మహిళా కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి ఘాటా మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కవయిత్రి లక్ష్మి పుస్తకం 'మన తెలుగు' గ్రాంథాన్ని, అరుణకుమారి 'అరుణారుణా కిరణాలు' పుస్తకం ఆవిష్కరించారు.

22 నుంచి అన్న సమారాధన

చింతల్: అయ్యప్పస్వాముల దీక్ష ప్రారంభమైన నేపథ్యంలో నవంబర్ 22 నుంచివచ్చే ఏడాది జనవరి 3వ తేదీ వరకు భగత్‌సింగ్‌నగర్ ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ధర్మశాస్త్ర సేవాసమితి అధ్యక్షుడు భూనేటి రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అయ్యప్పస్వామి దీక్ష చేపట్టిన ప్రతి అయ్యప్ప ఇక్కడ సమారాధనలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సమాప్రాధన కార్యక్రమం చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం, హరిహర క్షేత్రంలో ఈ వసతిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 26న అయ్యప్ప పడిపూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9059663440, 9949236133 లో సంప్రదించవచ్చన్నారు.

అభ్యుదయ, విప్లవ, అస్తిత్వవాద కవి నందిని సిధారెడ్డి

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కె.శివారెడ్డి

హిమాయత్‌నగర్: అభ్యుదయ, విప్లవ, అస్తిత్వవాద ఉద్యమాలతో మమేకమవుతూనే మనిషి కోసం కాలంలో పాటు కలిసి అడుగులు వేసిన కవి సిధారెడ్డి అని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కె.శివారెడ్డి అన్నారు. మహాకవి సినారె కల్యాణ పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన నందిని సిధారెడ్డి సాహిత్య సమాలోచన, మహాకవి సినారె జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శివారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిధారెడ్డికి సినారె జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో తనదైన దృక్పథంతో సమాజ చైతన్యం కోసం కవిత్వ సృజన చేస్తున్న కవి సిధారెడ్డి అని అన్నారు. తెలంగాణ సాధనలో రచయితలు, కవులు చేసిన కృషి మరువలేనిదని సిధారెడ్డి అన్నారు.

'కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల హామీలను ప్రజలు నమ్మరు'

కూకట్‌పల్లి: బీజేపీ బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌కు మద్దతుగా ఆదివారం బాలానగర్ డివిజన్ ఇందిరా నగర్‌లో మధ్య ప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ మురళీధర్‌రావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ కాంతారావు మాట్లాడుతూ.. బీజేపీ ప్రజారంజక ఎన్నికల మేనిఫెస్టో రూపొందించిందన్నారు. గ్యారంటీ లేని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల హామీలను నమ్మే స్థితిలో తెలంగాణ ప్రజలు లేరని అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారు నినాదంతో వస్తున్న బీజేపీ- జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గాజు గ్లాసుకు ఓటు వేసి ప్రేమకుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ఎన్నికల ప్రచారం చేస్తున్న మాధవరం కాంతారావు, నేతలు

పోలీసు అధికారుల ఫొటోలతో వాట్సాప్ సందేశాలు

హిమాయత్‌నగర్: పోలీసు అధికారుల ఫొటోలను వాట్సాప్ డిస్‌ప్లే పిక్చర్ (డీపీ)లుగా పెట్టుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. నగరంలోని పలువురు పోలీసు ఇన్‌స్పెక్టర్ల ఫొటోలను డీపీలుగా పెట్టుకుని అత్యవసరంగా డబ్బులు పంపాలని పలువురికి వాట్సాప్ ద్వారా సందేశాలు పంపిస్తున్నారు. దీంతో అనుమానం వచ్చి ఆయా అధికారుల మొబైల్ నంబర్లకు ఫోన్ చేసి అడిగితే తాము డబ్బులు అడగలేదని ఆ నంబర్లు తమవి కాదని చెబుతున్నారు. మొబైల్ నంబర్ల ఆధారంగా సైబర్ కేటుగాళ్ల పనిగా గుర్తించిన పోలీసులు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ తరహా మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి పేర్కొన్నారు. ఒకవేళ వాట్సాప్‌లో ఇలాంటి సందేశాలు వస్తే ఆయా మొబైల్ నంబర్లను రిపోర్ట్ చేసి, బ్లాక్ చేయాలన్నారు. ఈ మోసాలకు యత్నిస్తున్న ఆగంతకుల నంబర్లను గుర్తించామని, వాటిపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఉత్సాహంగా ఐకేర్ వాక్

బంజారాహిల్స్: పిల్లల్లో వచ్చే వక్రీభవన లోపాలపై అవగాహన తప్పనిసరి ఉండాలని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సీనియర్ పీడియాట్రిక్ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ మంజు భాటే అన్నారు. చిల్డ్రన్స్ ఐకేర్ వీక్‌లో భాగంగా ఆదివారం బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి నుంచి కేబీఆర్ పార్కు వరకు నిర్వహించిన ఐకేర్ వాక్‌లో పిల్లలు, వైద్యులు, వైద్య సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ ఐకేర్ వీక్‌లో రిఫ్రాక్టివ్ ఎర్రర్‌లపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.


బాలాజీనగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బండి రమేష్

కూకట్‌పల్లి అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్


కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న కూకట్‌పల్లి అభ్యర్థి బండి రమేష్, సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్ డివిజన్ కైత్లాపూర్ విలేజ్, రాఘవేంద్ర కాలనీ, సేవాలాల్ నగర్‌లలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు కృష్ణ రాజ్‌పుత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటింటి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆడినన్ని అబద్ధాలు దేశంలో ఏ అధికార పార్టీ సైతం ఆడదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేర్కొన్న హామీలన్నిటిని పదేళ్లుగా ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ కల్లబొల్లి మాటలు నమ్మి మరోసారి మోసపోకుండా కాంగ్రెస్ పార్టీ గెలిపించాలన్నారు. ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల అమలుకు చిత్తశుద్ధితో ఉన్నందున హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బండి రమేష్ సతీమణి జోరుగా ప్రచారం...

కూకట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ గెలుపు కోసం ఆయన సతీమణి బండి లకుమా దేవి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావుతో కలిసి ఆదివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి మాత్రమే దర్శనమిస్తున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసింది గోరంత ప్రచారం కొండంత అని పేర్కొన్నారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కైత్లాపూర్, 15వ ఫేజులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి లకుమా దేవి మాట్లాడుతూ... హస్తం గుర్తుకు ఓటు వేసి బండి రమేష్‌ను గెలిపించాలన్నారు. బండి రమేష్‌ని గెలిపించి కూకట్‌పల్లి అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రభుత్వ పథకాల హామీలను నిలబెట్టుకునే పార్టీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కైత్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న బండి రమేష్ సతీమణి బండి లకుమాదేవి, నాయకులు

అనాథలను ఆదుకోవటమే జీవిత పరమార్థం


అనాథ ఆశ్రమంలో వృద్ధులకు భోజనం, పండ్లు పంపిణీ చేసిన శశిభూషణ్ తదితరులు

మోతీనగర్: అనాథలను, అభాగ్యులను ఆదుకోవడంలోనే జీవితానికి సంతృప్తి లభిస్తుందని దర్శనం రూమ్స్ స్కూల్ కరస్పాండెంట్ శశిభూషణ్ పేర్కొన్నారు. ఆదివారం మోతీనగర్‌లోని అనాథాశ్రమంలో విద్యార్థినీ, విద్యార్థులతో పాటు వృద్ధులకు ఆహారం, బిస్కెట్లు, పండ్లు, మిఠాయిలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంతైనా సమాజం కోసం వెచ్చించినట్లయితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంతోమంది అనాథలు ఒక పూట భోజనం చేయలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. వారికి పట్టెడు అన్నం పెడితే అదే పరమాత్మునికి పూజ చేసినంత పుణ్యం లభిస్తుందని తెలిపారు.

కృష్ణారావుకే మా మద్దతు: అపార్ట్‌మెంట్‌ల అధ్యక్షులు


అపార్టుమెంట్‌ల వాసులతో సమావేశమైన కార్పొరేటర్ ముద్దం నర్సింహ

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని సూర్య మెన్సన్, వాసవీ టవర్స్, వాసవి నివాస్, శ్రీనివాస హోమ్స్, శ్రీనివాస రెసిడెన్సీ, శ్రీనివాస నిలయం, అలోపా, గాయత్రి రెసిడెన్సీ, అఖిల, మానవి, నియా, దియా అపార్టుమెంట్లలో నివాసం ఉండే వారితో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పాల్గొని కారు గుర్తుకు ఓటు వేసి మాధవరం కృష్ణారావును గెలిపించాలని కోరారు. చేసిన అభివృద్ధి, చేయబోయే అభివృద్ధిని వివరించి మరోసారి మాధవరం కృష్ణారావును ఆశీర్వాదించి గెలిపించాలన్నారు. అపార్టుమెంట్ వాసుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారించి పిలిస్తే పలికే అన్నగా ఉన్న మాధవరం గెలుపుకు మీవంతు కృషి అవసరమని చెప్పారు. వారు తమ మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో అపార్టుమెంట్ల అధ్యక్షులు సుముత్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి అశోక్ రెడ్డి, పవన్‌కుమార్, అంజయ్య, అశోకవర్ధన్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, బుర్రి యాదగిరి పాల్గొన్నారు.

మజ్లిస్ అభ్యర్థులు లేని చోట బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఓటు వేయండి

- కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ముస్లింలకు అందుతున్నాయి
- కూకట్‌పల్లి నియోజకవర్గంలో మాధవరం కృష్ణారావును గెలిపించండి
- ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ. చిత్రంలో కార్పొరేటర్ సబిహా బేగం

కూకట్‌పల్లి: గత పది సంవత్సరాల నుంచి హైదరాబాద్‌లో ఎలాంటి హిందూ, ముస్లిం గోడవలు కానీ.. కర్ఫ్యూలు కానీ లేవని ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ యూసుఫ్‌నగర్ చౌరస్తాలో జరిగిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

అల్లాపూర్ డివిజన్‌లో ఉర్దూ పాఠశాల నిర్మించాలి..

◆ తెలంగాణలో ప్రశాంతంగా కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మెజార్టీ ముస్లిం సోదరులకు అందుతున్నాయని అందుకే తాము బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతున్నామని స్పష్టం చేశారు. ఎంఐఎం పార్టీ అభ్యర్థులు లేని చోట బీఆర్‌ఎస్ అభ్యర్థులకు సపోర్ట్ చేయాలని కోరారు. అల్లాపూర్ డివిజన్ సర్వే నం.18లో ఉర్దూ పాఠశాల, కమ్యూనిటీ హాల్, అదే విధంగా పర్వత్‌నగర్‌లో ముస్లింలకు ప్రత్యేక శ్మశానవాటికను నిర్మించాలని కోరారు. ఈనెల 30న జరిగే సాధారణ ఎన్నికల్లో మాధవరం కృష్ణారావుకు ఓటు వేయాలని సూచించారు.

ఇమామ్ వేతనాలు ఇస్తున్న ఘనత కేసీఆర్

◆ విదేశీ విద్య, రంజాన్‌లో ముస్లింలకు కానుకలు, దావత్‌లు సైతం ఏర్పాటు చేయటం గర్వించదగ్గ విషయమన్నారు. మసీదులలో పనిచేసే ఇమామ్, మోజామ్‌లకు సైతం వేతనాలు అందించిన ఘనత కేసీఆర్‌కి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో అల్లాపూర్ డివజిన్ కార్పొరేటర్ సబిహాబేగం,ఎంఐఎం, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోవిడ్ సమయంలో ఎంఐఎం ఎంతో చేసింది..

◆ తాము కోవిడ్ సమయంలో ఎంతోమంది నిరుపేదలకు ఆక్సిజన్ కిట్లు అందించటంతో పాటు ఉచితంగా వైద్యం అందించామని తెలిపారు. కోవిడ్‌లో మరణించిన మృతదేహాలను నిబంధనల ప్రకారం ముస్లిం పద్ధతిలో అంత్యక్రియలు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు.

కాంగ్రెస్ ఆర్‌ఎస్‌ఎస్‌కు తల్లి లాంటిది...

◆ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తి అని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు బీజేపీ ఏ-టీమ్ అని, బీజేపీకి కాంగ్రెస్ బీ-టీమ్ అని ఆరోపించారు. కోవిడ్ సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ రేవంతన్న ఎక్కడ ఉన్నాడో తెలుసా? అని ప్రజలను అడగటంతో మోహన్‌భగవత్ దగ్గర ఉన్నాడని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆర్‌ఎస్‌ఎస్‌కు తల్లి లాంటిదని విమర్శించారు.

బుల్డోజర్లు దింపుతా అంటే హార్మోనియం వాయించుకుంటూ ఉంటామా?

◆ కిషన్ రెడ్డి పాతబస్తీలో బుల్డోజర్లు దింపుతానని అంటున్నారని తామేమీ హార్మోనియం వాయించటం లేదని వ్యంగ్యంగా విమర్శించారు. వాళ్లు ఎలా బుల్డోజర్లు దింపుతారో చూస్తామన్నారు. నాలుగు శాతం రిజర్వేషన్‌ను రద్దు చేస్తామని అనడం తగదని హితవు పలికారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన కొన్ని నల్ల చట్టాలను తాను వ్యతిరేకించానని గుర్తు చేశారు.


యూసుఫ్‌నగర్‌లో జరిగిన సభకు భారీగా హాజరైన ప్రజలు

'స్కందగీత' ఆవిష్కరణ

కూకట్‌పల్లి: వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో పీఎస్‌ఎం హైస్కూలులో ఇందిరా చంద్ర శేఖర్ ఆడిటోరియంలో చారిత్రక నవాల చక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ రచన స్కంద గీత గ్రంథాన్ని ఆదివారం సీనియర్ సంపాదకులు ఎంవిఆర్ శాస్త్రీ ఆవిష్కరించారు. సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి సభాధ్యక్షత వహించారు. 40 సంవత్సరాల అపూర్వ స్నేహాన్ని కొనసాగిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అశ్విని సుబ్బారావు, సీహెచ్ హనుమంతరావులకు ఈ గ్రంథాన్ని అంకితమిచ్చారు. ఈ కార్యక్మంలో ఏఈవీఆర్ శాస్త్రి, డా. అన్నదానం సుబ్రహ్మణ్యం, జలవేందర్‌రావు, సాధన నరసింహాచార్య, సిహెచ్ రాజేశ్వరరావు అతిథులుగా పాల్గొన్నారు.


హనుమంతరావు, అశ్విని సుబ్బారావును సన్మానిస్తున్న నిర్వాహకులు

ముగిసిన బాలల పండుగ



మాదాపూర్: చిన్నారి కళాకారులు సంగీత విభావరి, కూచిపూడి నృత్యాలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న బాలల పండుగ ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో దాదాపు 150 మంది కళాకారులు పాల్గొన్నారు. శేషం రమణ బృందం వేణునాదం, ప్రతిమ శశిధర్ శిష్యబృందం సంగీత విభావరి, డాక్టర్ రమాదేవి, రమణిసిద్ధి, దుర్గేష్ నందిని, అరుణశ్రీనివాస్, మృణాళిని, లక్ష్మి నల్లమోలు, శ్రీనివాస్ శిష్యబృందాలు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.